క్లుప్తంగా

క్విజ్ విజేతలకు బహుమతులు



క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు

టంగుటూరు: ఆర్బీఐ ఆధ్వర్యంలో టంగుటూరులో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.వి.భార్గవి, పి.వి.నాగ చైతన్య ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి బుధవారం రూ.5 వేల రూపాయలు నగదు బహుమతి, ప్రశంస పత్రాన్ని ఎంఈఓ టి.బాలాజీ చేతుల మీదుగా అందించారు. విద్యార్థులను హెచ్ఎం వాకా వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రంగమ్మ కుటుంబ సభ్యులకు బాలినేని పరామర్శ

టంగుటూరు: మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సూదనగుంట శ్రీహరిరావు, నారాయణ రావు మాతృమూర్తి రంగమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి జమ్ములపాలెంలోని నివాసంలో రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య తదితరులు ఉన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సంగీత

మద్దిపాడు: సచివాలయాల పరిధిలోని గ్రామాల ప్రజలకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించాలని మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యురాలు సంగీత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలల్లో క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సహకరించాలన్నారు. గ్రామాల్లో ఎవరికైనా జ్వరం, దగ్గు, అలసట, రాత్రి సమయంలో చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక పీహెచ్‌సీకి పంపాలన్నారు. పరీక్ష అనంతరం వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కనిష్ట ధర రూ.175



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కనిష్ట ధర రూ.175 పలికింది. దావగూడూరు, చింతలపాలెం గ్రామాల రైతులు 890 బేళ్లను వేలానికి తీసుకురాగా 864 కొనుగోలయ్యాయి. 26 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.246, కనిష్ట ధర రూ.175, సరాసరి ధర రూ.240.59 పలికింది. వేలంలో మొత్తం 32 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వేలం కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, కంపెనీ బయ్యర్లు, రైతులు యోగా సాధన చేశారు.

పిడుగుపాటుకు చీలిన వేపచెట్టు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని సీతారాంపురంలో సచివాలయం ముందున్న వేపచెట్టుపై పిడుగు పడింది. దీంతో చెట్టు చీలింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



భూసార పరీక్షలు చేయిస్తున్న ఏఓ జోత్స్న

కనిగిరి రూరల్: రైతులు విధిగా తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారి పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని కృష్ణాపురం, వంగపాడు తదితర గ్రామాల్లో బుధవారం భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే కేంద్రానికి 15 భూసార పరీక్షా నమూనాలను సేకరించనున్నట్లు చెప్పారు. భూసార పరీక్షల వలన భూముల్లో ఏ పోషకాలు ఎంత పరిమాణంలో ఉన్నది, ఎంత పరిమాణంలో ఎరువులు సిఫార్సు చేసుకోవాలన్నది తెలుస్తుందన్నారు. సర్పంచ్‌లు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎస్కే ఆసీఫా బేగం, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



కనిగిరిలో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్



కొట్టాలపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుకుమార్



చెన్నిపాడులో మాట్లాడుతున్న ఎంపీపీ మాధవరావు

పామూరు: క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బొట్లగూడూరు సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వచ్చి జనన, మరణ, కుల, ఆదాయ, వివాహ, కుటుంబసభ్యుని ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి నమోదు చేసి త్వరితగతిన పంపిణీచేయడం చేస్తామన్నారు. ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ పోలినేని శ్రీను, సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, నాగేశ్వరరావు, ప్రసాద్, క్రిష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జగనన్న సురక్షా కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎస్ హరిబాబు, ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు అన్నారు. జగనన్న సురక్ష పథకంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 1 నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. వలంటీర్లు తమ పరిధిలో ఇళ్లకు వెళ్లి వారికి సమస్యలు గుర్తించాలన్నారు. సర్పంచ్ అరుణ, రత్తాలు, కార్యదర్శులు, వలంటీర్లు, వెల్ఫేరు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలో జగనన్న సురక్షా పథకం పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి, వెంగలాయపల్లి, చింతగుంపల్లి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు ఈఓఆర్డీ మల్లీశ్వరి పాల్గొన్నారు.



పామూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

జగనన్న సురక్షపై సమీక్ష

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజల సమస్యలను నూరు శాతం పరిష్కరించే విధంగా ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సూచనలు, ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేసి అర్హులకు ప్రభుత్వ పథకాలను అందజేయడంతోపాటు 11 రకాల అర్హత పత్రాలను ప్రజలకు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కల్పన పాల్గొన్నారు.

వెలిగండ్ల: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని కొట్టాలపల్లి, మొగళ్లూరు, గన్నవరం గ్రామ సచివాలయాల్లో బుధవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ మండల, క్లస్టర్, గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించిన తరువాత డోర్ టు డోర్ సర్వే చేయాలన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్లలు రెండు టీమ్‌లుగా ఏర్పడి ఈ కార్యక్రమం సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ సచివాలయం ఉద్యోగితో పాటుగా వలంటీర్లు, గృహసారధులు, అంగన్‌వాడీ, ఆశ, వెలుగు, ఉపాధి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామన భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఇందిరా కాలనీ సచివాలయంలో బుధవారం సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లకు, కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను పూర్తి స్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి అందించాల్సిన చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు పులి శ్రీనివాసులరెడ్డి, పసుపులేటి దీప, దేవకి సత్యవతి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బొట్లగూడూరులో యోగాసాలు వేస్తున్న అధికారులు, నేతలు



పీసీపల్లిలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



ఆలకూరపాడులో యోగా చేస్తున్న విద్యార్థులు

పామూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, మండల ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గద్దే ఏడుకొండలు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం బొట్లగూడూరు, పామూరులో నిర్వహించారు. పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం గంట సేపయినా యోగా చేయాలని తద్వారా మానసిక వత్తిడి తగ్గుతుందన్నారు. యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. విద్యార్థులు యోగా చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతాయన్నారు. ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, జనవిజ్ఞానవేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెన్నక్రిష్ణ, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, క్రిష్ణమూర్తి, పలువురు పాల్గొన్నారు.

పీసీపల్లి: యోగాతో విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందుతుందని పాఠశాల హెచ్ఎం అరుణ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని దివాకరపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. విద్యార్థి దశ నుంచే యోగాను అలవర్చుకోవడం వల్ల విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు శ్రీవేణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలన్నారు. యోగా వల్ల మంచి ఆరోగ్యంతో పాటు, పాజిటివ్ దృక్పథం, మంచి ఆలోచనలు వస్తాయన్నారు. అనంతరం యోగా గురువు నాగేశ్వరరావు యోగాసనాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్కే అబ్దుల్ గఫార్, కోర్టు సూపరింటెండెంట్ నాగయ్య, బార్ అసోసియేషన్ సభ్యులు ప్రేమలీలావతి, సుబ్బారావు, శ్రీకాంత్‌రెడ్డి, నర్సారెడ్డి, కొండలరావు, అబ్దుల్ ఫయాజ్, న్యాయవాది గుమస్తాల సంఘం అధ్యక్షుడు సయ్యద్ యాసీన్ న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం వాకా వెంకటటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని పేర్కొన్నారు. పీడీ వెంకట్రావు విద్యార్థులతో సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయం, ధాన్యం చేయించారు. కార్యక్రమంలో సర్పంచి బిళ్లా ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి సాంబయ్య, ఉపాధ్యాయులు డి. శ్రీధర్‌బాబు, భూషణ్ రెడ్డి, ఎం.సురేష్, పి.సుబ్బారావు, ఎం.చెన్నయ్య, జ్యోతి, ఎ.విజయ లక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



యోగా దినోత్సవంలో జడ్జి కె.భరత్‌చంద్ర

యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోండి

సింగరాయకొండ: యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉపాధి హామీ పథకం ఒంగోలు క్లస్టర్ లెవెల్ రిసోర్స్ సెంటర్ ఇన్‌చార్జి అధికారి శ్యాంసన్ సూచించారు. మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో బంగారుకుంట వద్ద బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉపాధి కూలీలకు యోగాపై అవగాహన కల్పించారు. కూలీలతో యోగాసనాలు వేయించారు. రోజూ యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏపీఓ సీహెచ్‌వీ సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యంత్రాలతో కాదు కూలీలతోనే

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి అడవిపేరంటాళమ్మ – నేరేడుపల్లి హౌసింగ్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణం ఉపాధి కూలీలతోనే జరిగిందని ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. యంత్రాలతో రోడ్డు పనులు చేశారని పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, ఏపీఓ సుబ్బారావులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులు చేసిన కూలీలు సదరు ప్రాంతానికి వచ్చి ఎంపీడీఓ ఎదుట తెలిపారు. తామే ఈ రోడ్డును బాగు చేశామన్నారు. ఏపీఓ సుబ్బారావు.. ఎంపీడీఓకు సమాధానమిస్తూ టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల రెడ్డి గారి కాలనీకి ఉపాధి లేదని ఇప్పుడే ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజుల పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ యాదవ్‌ను ఆదేశించారు. రాజకీయ దురుద్దేశంతోనే అసత్యపు ఆరోపణలతో ఆ కథనాలు ప్రచురించారని, ఆ కథనాల్లో ఎటువంటి వాస్తవం లేదని కొట్టిపారేశారు.



పని జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కమనీయం.. సీతారామస్వామి కల్యాణం



సీతారామస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నీలకంఠాపురం సీతారాముల కల్యాణం

పొన్నలూరు: మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామంలో సీతారామస్వామి కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు రమణయ్య పంతులు స్వామివారి దంపతులకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కల్యాణం సందర్భంగా గ్రామస్తులు నూతన వస్త్రాలు ధరించి సందడి వాతావరణంలో సీతారామ స్వామి దంపతులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన బాలు ఈశ్వర్‌రెడ్డి, సుజాత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి స్వామివారికి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణం సందర్భంగా ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మారుమోగింది. భక్తులందరికీ అన్నదానం చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

హనుమంతునిపాడు: మండల పరిధి నీలకంఠాపురంలో బుధవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల వేదమంత్రాల నడుమ దుగ్గిలి చెన్నయ్య చెన్నమ్మ దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు స్వామికి తలంబ్రాలను పోసి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు



మాట్లాడుతున్న పీడీ బాబురావు



పాల్గొన్న వీఓఏలు, గ్రూపు సభ్యులు

- డీఆర్‌డీఏ పీడీ బాబురావు
- స్త్రీనిధి మొండి బకాయిలు వసూలు చేయండి

కనిగిరి రూరల్: విధి నిర్వహణలో వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ బాబురావు అన్నారు. స్థానిక షాదీఖానాలో వైఎస్సార్‌కేపీ కనిగిరి క్లస్టర్ పరిధిలోని ఏపీఎంలకు, సీసీలకు, వీఓఏలకు బుధవారం సమీక్షా సమావేశం ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ బాబురావు మాట్లాడుతూ వైఎస్సార్ కేపీ సిబ్బంది పొదుపు సంఘాలు, గ్రూపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్లస్టర్ పరిధిలోని ప్రతి గ్రూపు ఏ గ్రేడ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, రుణాల రికవరీలో అమలులో ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. మొత్తం 5660 గ్రూపులకు ఎప్పటికప్పుడు వీఓలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిపించాలని సూచించారు. జగనన్న హౌసింగ్‌కాలనీ నిర్మాణాలకు గ్రూపు సభ్యులకు రుణాలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో గ్రూపులను బలోపేతం చేసేందుకు వైఎస్సార్ కేపీ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని చెప్పారు. స్త్రీ నిధికి సంబంధించి క్లస్టర్ పరిధిలో రూ.2.24 కోట్లు ఉన్నాయని, వాటిని రెండు నెలల్లో మొండిబకాయిలన్ని కట్టించి, వారికి తిరిగి రుణాలు ఇప్పించాలన్నారు. ప్రతి గ్రూపులో అర్హత కల్గిన ప్రతి సభ్యుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చే యాలన్నారు. ఏసీ కత్తి కళ్యాణ్, డీపీఎం నరసింహ, కృపారావు, సుబ్బారావు, శేషు, ఆర్ఏఓ హర్షవర్ధన్, ఏపీఎంలు హెచ్ డీ గంటా శ్రీనివాసరావు, జీవరత్నం, లక్ష్మీనారాయణ, విద్యా సాగర్, ఇందిరా, రజినీ, వీఓఏలు పాల్గొన్నారు.

రాళ్లపాడు గేట్లను పరిశీలించిన ఈఈ

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు కొత్త, పాత స్పిల్‌వే గేట్లను మెకానికల్ వర్క్‌షాపు ఈఈ శ్యాంప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త స్పిల్‌వే గేరుబాక్స్‌లను, రోప్‌లను పరిశీలించి గేట్లు ఎలా పనిచేస్తున్నాయని డీఈ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం గురించి, నీటి విడుదల సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి డీఈ వివరించారు. ఈఈ మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టడంతో ప్రాజెక్టును పరిశీలించినట్లు చెప్పారు. ప్రాజెక్టు కొత్త స్పిల్ గేర్‌బాక్స్‌లు, రోప్‌లకు, పాత స్పిల్‌వే చైన్లకు గీసు పెట్టే విధంగా చూడాలని డీఈకి సూచించారు. ప్రాజెక్టు జనరేటర్లను పరిశీలించిగా వాటి పనితీరు బాగుందని, జనరేటర్లు కండిషన్‌లో ఉన్నట్లు చెప్పారు. ఏఈ చంద్రమౌళి, సింధూజ తదితరులు పాల్గొన్నారు.

నేడు పొందూరులో గడప గడపకు మన ప్రభుత్వం

టంగుటూరు: మండలంలోని పొందూరు సచివాలయం పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఉదయం 07:30 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

హైదరాబాద్‌కి నూతన సర్వీస్ ప్రారంభం

కందుకూరు: కందుకూరు డిపో నుంచి హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను బస్సు సర్వీస్‌ని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సుప్రజారెడ్డి బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె కందుకూరు డిపోలో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్‌లు, గ్యారేజీ సిబ్బంది, కంట్రోలర్‌లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. రద్దీ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని నూతన సర్వీసులు నడుపుతున్నారని, అలాగే ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు, సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నూతన సర్వీసు కందుకూరు నుంచి పొన్నలూరు, చెన్నుపాడు, జగ్గరాజుపాలెం, వర్ధినేనిపాలెం, రావులకొల్లు, కామేపల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి రోజు కందుకూరు డిపో నుంచి రాత్రి 7.20 గంటలకు బయలుదేరుతుందని, అలాగే ఈనెల 26వ తేదీ నుంచి ఈ బస్సు రిజర్వేషన్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆర్టీసీ డీఎం పెద్దన్నశెట్టి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతంతో మెరుగైన ఫలితాలు

పామూరు: ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రభుత్వ పాఠశాల విద్యారంగం బలోపేతమై మెరుగైన ఫలితాలు వస్తున్నాయని ఎంఈఓ జి.కరుణకుమారి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం పాఠశాల హెచ్‌యం సయ్యద్ ఇసాక్ అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాలు పథకం కింద మెడల్, ప్రసంసాపత్రం, ప్రోత్సాహకంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. సర్పంచ్ మన్నేపల్లి విజయ్‌శేఖర్, పి.వి.క్రిష్ణమోహన్, గద్దే సుధాకర్, అస్సాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీపల్లి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినచ రాష్ట్రంలో రాష్ట్రంలో విద్యా విప్లవం ప్రారంభమైందని ఎంఈఓ దాసుప్రసాద్, ఆర్ శ్రీనివాసులు అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. జెడ్పీటీసీ లక్ష్మీకాంతమ్మ, ఎంపీపీ జనన్య, వైస్ ఎంపీపీ సతీష్ కుమార్, ఏడు హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కన్వీనర్ బొర్రారెడ్డి, ఓకేరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పామూరులో ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎంఈఓ, హెచ్ఎం



పీసీపల్లిలో నగదు బహుమతులు అందజేస్తున్న అధికారులు, నేతలు